## నేటి నుంచి వ్యవసాయ మార్కెట్‌లో స్పెషల్ డ్రైవ్


మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న దుకాణాదారులపై శుక్రవారం నుంచి వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ దామోదర్ తెలిపారు. గురువారం మార్కెట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, రైతులకు వినియోగదారులకు మార్కెట్ లోపలికి రావాలంటే ఇబ్బందికరంగా మారిందని, రోడ్లను ఆక్రమించి దుకాణాదారులు వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందితో పాటు, అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. నిబంధనలు అతిక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే నోటీసులు జారీ చేసి లైసెన్స్‌లు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు పై ఉన్న రెడ్ మార్కును దాటి దుకాణాలను ఏర్పాటు చేయొద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

ఎల్‌బీనగర్: ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని వైదేహినగర్ నార్త్ ఓనర్స్ అసోసియేషన్, రెడ్ క్రాస్, సాయిస్థలి సంయుక్తాధ్వర్యంలో గురువారం సాయిబాబా ఆలయం వద్ద ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మహిళలకు, వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కాలనీ అధ్యక్షుడు పోగుల రాంబాబు, సభ్యులు రాజేందర్‌రెడ్డి, నాగరాజు, వేణుగోపాల్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

## షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మలక్‌పేట: నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల గురువారం అంబర్‌పేట మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద వర్గాల ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్‌బాగ్ డివిజన్లకు చెందిన 72 మందికి చెక్కులు అందజేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐ, మజ్లిస్ నాయకులు ఉన్నారు.

## వరద ముంపు నివారణకు చర్యలు చేపట్టాలి

సైదాబాద్: వర్షాకాలం రాకముందే ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలో వరద ముంపు నివారణకు అవసరమైన చర్యలను త్వరితగతిన చేపట్టాలని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం డివిజన్ పరిధిలోని ఏపీఎస్ ఆర్టీసీ కాలనీలో కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకన్న, ఈఈ ఏకాంబరం, ఏఈ అన్సారీ, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

# 'యోగా'నుబంధం

- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం
- పతంజలి యోగా సాధన సమితిపై ప్రత్యేక కథనం


వనస్థలిపురం హుడా పార్కులో యోగా సాధన చేస్తున్న పతంజలి యోగా సమితి సభ్యులు

వనస్థలిపురం: వారంతా ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి వనస్థలిపురం పరిసర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వివిధ ఉద్యోగాలు, వృత్తులు, వ్యాపారాలు, చదువులు కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారందరినీ ఒకటిగా కలిపింది ×యోగా. పతంజలి యోగా సాధన సమితి ఇందుకు వేదికైంది. సమితి ఆధ్వర్యంలో వారంతా యోగా శిక్షణను పొందుతూ ఇటు ఆరోగ్యపరంగా, అటు ఐకమత్యంగా ముందుకు సాగుతున్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా గురువులకు సత్కారం, వివిధ కార్యక్రమాల నిర్వహణకు సిద్ధమవుతున్నారు.

యోగా గురువు, మింట్ కంపౌండ్ ఉద్యోగి పిల్లలమర్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 2004లో పతంజలి యోగా సాధన సమితి ఏర్పడింది. గత 20 ఏళ్లుగా యోగా శిక్షకుడు శ్రీనివాస్, మరో రిటైర్డు ఉద్యోగి యాదయ్యల పర్యవేక్షణలో వనస్థలిపురం రైతుబజారు సమీపంలోని హుడా పార్కులో ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది మంది ఉచితంగా యోగా శిక్షణ పొందుతున్నారు. ఇప్పటి వరకు సుమారు 5 వేల మందికి పైగా యోగా సాధన సమితి ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. యోగా సాధకులు ఒక కుటుంబంలా ఉంటూ సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. పండుగలు, ఇతర సందర్భాల్లో కలివిడిగా ఉంటూ వేడుకలలో తమ ఆత్మీయతను చాటుకుంటున్నారు.

### వారి ఆత్మీయతే కొండంత సంపద



పతంజలి యోగా సాధన సమితిని ఏర్పాటు చేసి ఇప్పటి వరకు వేలాది మందికి ఉచితంగా యోగా శిక్షణ అందించాం. ఉద్యోగం చేస్తున్నప్పటికీ ఉదయం, సాయంత్రం వేళల్లో క్రమం తప్పకుండా పార్కులో యోగా శిక్షణ ఇచ్చా. ప్రస్తుతం రిటైర్డ య్యాను కాబట్టి మరింత సమయం యోగా శిక్షణకు కేటాయిస్తా. శిక్షణ పొందినవారు నాపై చూపే ఆత్మీయతే కొండంత సంపద.

– పి.శ్రీనివాస్, మింట్ కంపౌండ్ ఉద్యోగి, యోగా శిక్షకుడు

### వేలాది మందికి శిక్షణ



పతంజలి యోగా సాధన సమితి ఆధ్వర్యంలో వేలాది మంది శిక్షణ పొందారు. యోగా శిక్షణకు రైతుబజారు సమీపంలోని పార్కులో ప్రత్యేకంగా షెడ్డు నిర్మించాం. ఇక్కడ యోగా శిక్షణే కాకుండా తరచూ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. అక్కడక్కడ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, ఇతర సంఘటనలపై సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాం.

– గంగం శివశంకర్, సమితి ప్రధాన కార్యదర్శి

## సీఎం సహాయ నిధితో పేదలకు లబ్ధి


సీఎం సహాయనిధి ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధి పవనగిరి కాలనీకి చెందిన భరత్ చంద్ర కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స ఖర్చులు భరించే ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో కుటుంబసభ్యులు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.15 లక్షల ఎల్‌ఓసీ చెక్కును మంజూరు చేయించి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం సహాయ నిధి వల్ల ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతోందని, పేదలు నాణ్యమైన వైద్య సేవలు పొందేందుకు అండగా ఉంటున్నదని అన్నారు. నాయకులు రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో ఇబ్బందులు రానీయొద్దు

**అధికారులకు ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశం**

దిల్‌సుఖ్‌నగర్: వచ్చే వర్షా కాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని వివిధ శాఖల అధికారులకు మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్కేపురం ,సరూర్‌నగర్లకు చెందిన జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్, ఎలక్ట్రికల్, టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు డివిజన్లలోని కాలనీలు బస్తీల్లో జరుగుతున్న, జరగాల్సిన పనుల గురించి ఆరా తీశారు. ఎన్నికల కోడ్ ముగియడంతో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ త్వరగతిన పూర్తిచేసి ఈ వర్షాకాలంలో ప్రజలకు ఇలాంటి ఇబ్బంది గలగకుండా చూడాలని ఆయా అధికారులను ఆదేశించారు. గతంలో మంజూరైన పనులను పనులను పూర్తి చేయాలనీ, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ప్రజలకు అనుగుణంగా మెరుగుపర్చాలని సూచించారు.

## చిరు వ్యాపారులపై వేధింపులు ఆపాలి

ఎల్‌బీనగర్: కొత్తపేట పండ్ల మార్కెట్ వద్ద చిరు వ్యాపారులపై జీహెచ్‌ఎంసీ వేధింపులను ఆపివేయాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. ఈ మేరకు ఆయన ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ (జెడ్సీ) పంకజకు రాసిన లేఖను గురువారం ఏఐటీయూసీ నాయకులు ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, జిల్లా కార్యదర్శి శేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి పండ్ల మార్కెట్ వద్ద చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వారిని ఇబ్బంది పెట్టడం తగదని అన్నారు. పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు చిరువ్యాపారులను వేధించడం నిలిపివేయాలని వారు విజ్ఞప్తి చేశారు. నాయకులు నరసింహ, జ్యోతి పాల్గొన్నారు.

## డ్రగ్స్ డీ అడిక్షన్ సెంటర్ ప్రారంభం


సెంటర్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ శైలజ

చాదర్‌ఘాట్: కేంద్ర ప్రభుత్వం నిధులతో మలక్‌పేటలోని వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో డ్రగ్స్ డీ అడిక్షన్ సెంటర్‌ను రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, నేటి యువత మత్తుకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, దానిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఈ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నదని అన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ట్రెనింగ్ వారిని ఎంపిక చేసి కాలేజ్, స్కూల్స్‌లో అవగాహన కల్పిస్తామన్నారు. కమ్యూనిటీ ఎడ్యుకేటర్ వారికి ఈ సెంటర్‌లో ట్రెనింగ్ ఇచ్చి జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు ఈ శాఖ తరఫున చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ జయంతి, అడిషనల్ డైరెక్టర్, సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

## అండర్ కేబుల్ పనులను అడ్డుకోవాలని వినతి

చంపాపేట: డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ కాలనీ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేయనున్న హైటెన్షన్ విద్యుత్ అండర్ కేబుల్ పనులను వెంటనే అడ్డుకోవాలని కాలనీ అధ్యక్షుడు బీసుకుంట్ల సతీస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయనతో పాటు కాలనీవాసులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం సతీష్‌గౌడ్ మాట్లాడుతూ...పదిహేను అడుగుల కాలనీ రహదారిలో గతంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ వేశారని, కాలనీవాసి జిట్టా శ్రీశైలం రెడ్డి అధికారులను ప్రలోభ పెట్టి తన స్థలంలోకి ఇరుకుగా ఉన్న అదే రహదారిలోంచి 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగలను ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నాడని ఆరోపించాడు. శ్రీశైలం రెడ్డి తన ప్రయత్నాన్ని విరమించుకోకపోతే కాలనీవాసులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఆయన అన్నారు. కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు యాదయ్య, సుదర్శన్‌గౌడ్, విజయలక్ష్మి, అర్జున్‌గౌడ్, గోపీనాథ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## వివక్ష లేని సమాజం ఏర్పాటుకు కృషి

మన్సూరాబాద్: కుల, మత, జాతి, లింగ వివక్ష లేని సమాజం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తున్నానని సమతా ఆధ్యాత్మిక విప్లవవాది యోగి సిద్ధరామయ్య (మలిశాల గురూజీ) అన్నారు. ద్వేషం, అసమానతలకు వ్యతిరేకంగా హిందూమతం అనే అంశంపై బుధవారం నగరంలో నిర్వహించిన సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. భక్తుల కోరిక మేరకు గురువారం ఆయన ఎల్‌బీనగర్‌లోని సహారా ఫంక్షన్ హాల్‌లో విడిది చేసి భక్తులకు ఉపదేశం ఇచ్చారు. త్రినాథ్ గురూజీ, బీవీఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పనులను పూర్తి చేయాలని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్ జలమండలి అధికారులకు సూచించారు. గురువారం ఆమె ఫతుల్లాగూడలో సుమారు రూ. 2.లక్షల నిధులతో చేపట్టే డ్రైనేజీ లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. జలమండలి మేనేజర్ అర్చన, వాటర్ వర్క్స్ సూపర్‌వైజర్ రమేష్, నాయకులు నరేందర్ రెడ్డి, సరస్వతి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## జీవనశైలిలో యోగాను భాగం చేయాలి


యోగాసనాలు సాధన చేస్తున్న రెవెన్యూ బోర్డ్ కాలనీవాసులు

సైదాబాద్: ఆరోగ్య పరిరక్షణ కోసం అందరూ తమ జీవనశైలిలో యోగాను భాగం చేయాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ అసిస్టెంట్ డైరెక్టర్ గోలిపెంచల ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం సంస్థ ఆధ్వర్యంలో సైదాబాద్ డివిజన్ రెవెన్యూ బోర్డ్ కాలనీ పార్కులో యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ థీమ్‌తో యోగాపై అవగాహన, యోగా అభ్యాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సిబ్బంది, కాలనీవాసులు యోగాసనాలు సాధన చేశారు. కార్యక్రమంలో డాక్టర్ క్రిస్ ఆంటోని, డాక్టర్ వైరముత్తు, లైబ్రేరియన్ శ్రీనివాసరావు, అచ్యుత రామయ్య, శ్రీధర్‌రెడ్డి, వరప్రసాద్, డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## పెద్దచెరువు వద్ద నేడు యోగా డే వేడుకలు

మన్సూరాబాద్: స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్ పెద్ద చెరువు ప్రాంగణంలోని యోగా షెడ్ వద్ద శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవా న్ని నిర్వహించనున్నారు.రిటైర్డ్ సైంటిస్ట్, యోగా గురువు భరత్‌భూషణ్ ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని కార్పొరేటర్ తెలిపారు.

## యోగా సాధనతో మానసిక ఒత్తిడికి చెక్


అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

చంపాపేట: క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం ద్వారా మానసిక ఒత్తిడి తొలగిపోతుందని కర్మన్‌ఘాట్ లోటస్ ల్యాప్ ఉన్నత పాఠశాల చైర్మన్ కడాం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. యోగా గురువు ఇస్మాయిల్ గురూజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి ఆసనాలు సాధన చేయించారు. అనంతరం సాయిరాంనగర్, అంజిరెడ్డి కాలనీల్లో యోగా నిత్య సాధన వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపే ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మాధవి, ప్రిన్సిపాల్ శేషు, ఫణి, మేనేజర్ నందికొండ రవీంద్రారెడ్డి, ఇన్‌చార్జి నాగరాణి పాల్గొన్నారు.

## బాక్స్ డ్రెయిన్, రోడ్డు సమస్యలను పరిష్కరించండి

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో నెలకొన్న బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు, రోడ్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. గురువారం ఆయన జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌ను కలిశారు. కొత్తపేట డివిజన్‌లో ఉన్న బాక్స్ డ్రెయిన్, రోడ్డు తదితర సమస్యలను వివరించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఏఈ మత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ న్యూనాగోలు కాలనీలో గురువారం కార్పొరేటర్ పవన్‌కుమార్ పర్యటించి కాలనీ సమస్యలను తెలుసుకున్నాడు. వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి కాలనీలో ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. కాలనీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, నాయకులు అశ్విన్‌సింగ్, వెంకట్‌రెడ్డి, తోట మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

## పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి

మలక్‌పేట: సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సలీంనగర్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్స్‌కు నాలుగు డీఏలు మంజూరు చేస్తూ శుక్రవారం జరిగే రాష్ట్రమంత్రి మండలి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో సెక్రటరీ జనరల్ చోళ ఓంప్రకాశ్ యాదవ్, కోశాధికారి గోరంట్ల ప్రసాద్, సహ అధ్యక్షుడు మదన్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



చంచల్‌గూడ: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలోని రెయిన్‌బజార్‌లో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రెయిన్‌బజార్ ప్రాంతంలో ఓ వ్యక్తి నిర్జీవంగా పడి ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించిన పోలీసులు అప్పటికే అతను చనిపోయినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసిన మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి తరలించారు. మృతుడి వయసు 45 నుంచి 50 సంవత్సరాలు ఉంటుందని, తెల్ల షర్టు, నల్ల రంగు ప్యాంటు ధరించాడని పోలీసులు తెలిపారు.

## నులిపురుగుల నివారణతో చిన్నారులకు ఆరోగ్యం


చంపాపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఉపాధ్యాయులు

నాగోలు: ప్రతీ ఆరు నెలలకు ఒకసారి పిల్లలకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు (ఆల్బెండజోల్ టాబ్లెట్) వేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ సూచించారు. చిన్నారులకు ఎటువంటి బ్యాక్టీరియా సోకకుండా ఆరోగ్యంగా ఉండేందుకు ఆల్బెండజోల్ మాత్రలు దోహదం చేస్తాయన్నారు. అంతర్జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం కొత్తపేట డివిజన్‌లోని శివమ్మ నగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు వారికి ఆయన ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేశారు. డాక్టర్ నరేష్, డాక్టర్, అరవింద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజేందర్ రెడ్డి, పాండు రంగారెడ్డి, శ్రీనివాస్, శివామ్మ నగర్ కాలనీ అధ్యక్షుడు రవి నాయక్, ఏఎన్‌ఎం కృష్ణవేణి, కమల వెంకటమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు

**సరూర్‌నగర్‌లో...**

చైతన్యపురి: సరూర్‌నగర్ పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో పానసీయ మహావిద్యాలయ స్కూల్‌లో గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు వేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఉషారాణి, ఆశ కార్మికులు, వైద్య సిబ్బంది పాల్గొనారు.

చంపాపేట: చంపాపేటలోని మండల పరిషత్ కేంద్ర ప్రాథమిక పాఠశాలలో గురువారం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 2002- 03 పూర్వ విద్యార్థులు పాఠశాలకు అల్మారా విరాళంగా అందజేశారు. హెచ్‌ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మి, సుదేష్ణ, అజిత, వెంకటదేవి, జ్యోతి, రజిత, రామ్‌రెడ్డి, నంద్యాల కావ్య పాల్గొన్నారు.

**నాగోలు డివిజన్‌లో..**

నాగోలు డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేశారు. కార్యక్రమంలో నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పాల్గొని నులిపురుగుల నిర్మూలన మాత్రలు విద్యార్థులకు వేశారు. ఆశ వర్కర్లు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, సరస్వతి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# మూడ్రోజులైనా పరిష్కారం కాని సమస్య

- పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు
- స్థానికుల ఆందోళన


భారీగా పారుతున్న మురుగు నీరు

లింగోజిగూడ: కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్ ప్రధాన రహదారిలో 10 రోజులుగా పొంగి పొర్లుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది మూడు రోజులుగా శ్రమిస్తున్నా సమస్య మాత్రం ఇంకా పరిష్కారం కాలేదు. కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్ ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంలో నిత్యం వందల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. దీంతో పనులకు ఆటంకం ఏర్పడుతోంది. దీంతో గురువారం ట్రాఫిక్ పోలీసులతో రెండు వైపులా భారీ గేట్లను ఏర్పాటు చేసి వాహనాలను తపోవన్ కాలనీ మీదుగా మళ్లించారు. దీంతో కొద్దిగా ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

**స్థానికుల ఆందోళన...**

పది రోజులుగా డ్రైనేజీ పొంగి పొర్లుతున్నా అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోకపోవడంపై వడ్డెర బస్తీ, తపోవన్ కాలనీ వాసులు, స్థానిక వ్యాపారులు గురువారం ఆందోళనకు దిగారు. అధికారుల నిర్లక్ష్య ధోరణితో ఇబ్బందులు పడుతున్నామని, చిన్న సమస్యను పరిష్కరించడానికి ఇన్ని రోజులు ఎందుకు తీసుకుంటున్నారని మండిపడుతున్నారు. జలమండలి అధికారులకు కమీషన్ల మీద ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

**నాలాల్లో భారీగా చెత్తా చెదారం**

వర్ష కాలం దృష్టిలో పెట్టుకొని నాలాల్లో, డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలో పూడిక తీత పనులు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పొంగుతన్న డ్రైనేజ్ మ్యాన్‌హోల్ సమస్య పరిష్కారం కాకపోవడంతో రెండు మూడు మీటర్ల మేర డ్రైనేజీ పైప్‌లైన్ తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.అలాగే తపోవన్ కాలనీ ఫేజ్- కమాన్ వద్ద గురువారం పూడిక తీత పనులు చేపట్టగా భారీగా చెత్త వచ్చింది. నాలాలో ఒక చోట సుమారు రెండు ట్రాక్టర్ల మట్టి, దుస్తులు, రాళ్లు భయ పడటంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

**సెంట్రింగ్ తొలగించకపోవడంతోనే..**

వరద ముంపు సమస్యకు శ్రీనివాస్ కాలనీ మీదుగా సరూర్‌నగర్ చెరువులో కలిసే విధంగా ఇటీవల బాక్స్ డ్రైన్‌ను నిర్మించారు.బాక్స్ డ్రైన్ నిర్మాణం అనంతరం పైన స్లాబ్‌లను నిర్మించారు.స్లాబ్ నిర్మాణం కోసం బాక్స్ డ్రైన్‌లో ఏర్పాటు చేసి సెంట్రింగ్‌ను చాలా చోట్ల తొలిగించకుండా అలాగే వదిలేశారు. సెంట్రింగ్ కర్రలకు చెత్తాచెదారం తట్టుకొని డ్రైనేజీ నీరు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.


నాలా నుంచి వెలికి తీసిన పూడిక